సాక్షి
విజయనగరం

మంగళవారం । 30 । జూలై । 2024



మాజీ ఆర్మీ ఉద్యోగి ఉగ్రవాదా?

దేశ రక్షణలో భాగంగా ఉగ్రవాదులను ఎదుర్కొన్న జవాన్‌ను ఉగ్రవాదిలా అవమానించి పోలీసులు ఇంటిమీదకు వెళ్లడం దారుణమని ఎమ్మెల్సీ సురేష్ బాబు ఆగ్రహం వ్యక్తం చేశారు. - 8లో



జిల్లా ప్రగతికి ప్రజల సహకారం కావాలి

పార్వతీపురం మన్యం జిల్లాను అభివృద్ధి పథంలో నడిపించడానికి జిల్లా ప్రజల సహాయ సహకారాలు అవసరమని కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ అన్నారు. - 8లో



సమస్యలుంటే చెప్పండి

మండలానికి కావాల్సిన రోడ్లు, పీహెచ్‌సీ భవనం మరమ్మతులు, గ్రామాల్లో కావలసిన ఇంకా ఏమైనా ఉంటే మా దృష్టిలో పెట్టండని జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు కోరారు. - 8లో

న్యూస్‌రీల్

క్రీడా సంఘాల వివరాలు అందజేయాలి

విజయనగరం: జిల్లాలో అధికారికంగా గుర్తింపు పొందిన క్రీడా సంఘాలకు సంబంధించిన పూర్తి వివరాలను ఈ నెల 30వ తేదీ సాయంత్రం 5 గంటలలోగా జిల్లా క్రీడాప్రాధికార సంస్థ కార్యాలయానికి అందజేయాలని డీఎస్‌డీఓ ఎస్.వెంకటేశ్వరరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మరిన్ని వివరాలకు సెల్: 80741 16276 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

డీఎస్సీ పరీక్షకు ఉచిత శిక్షణ

విజయనగరం అర్బన్: జిల్లాలోని మైనారిటీ అభ్యర్థులకు టెట్, డీఎస్సీ పరీక్షలకు ఉచిత శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్లు రీజినల్ సెంటర్ ఫర్ ఎడ్యుకేషనల్ డెవలప్‌మెంట్ ఆఫ్ మైనారిటీస్ (ఆర్‌సీఈడీఎం) వెల్ఫేర్‌శాఖ ప్రాజెక్టు అసోసియేట్ ఎస్.సుధాకర్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ముస్లిం, క్రిస్టియన్, సిఖ్, బుద్దిస్ట్, పార్సీ అభ్యర్థులు ఈ శిక్షణకు అర్హులని పేర్కొన్నారు. విశాఖపట్టణంలో పేరున్న శిక్షణ సంస్థలో ఉచిత శిక్షణ ఇప్పిస్తామన్నారు. ఆసక్తిగల అభ్యర్థులు పాస్‌ఫొటో, టెట్‌కు అప్లై చేసిన ఎక్‌నాలెడ్జ్‌మెంట్ కాపీ, ఆధార్ జెరాక్స్‌లను తీసుకుని విశాఖలోని సిరిపురంలో ఉన్న కార్యాలయంలో అందజేయాలని సూచించారు. పూర్తి వివరాల కోసం సెల్:90523 42344 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

వచ్చేనెల 1న జాబ్‌మేళా

విజయనగరం అర్బన్: వివిధ ప్రైవేట్ కంపెనీల్లో ఉద్యోగాల భర్తీ కోసం వచ్చేనెల 1వ తేదీన జాబ్ మేళా నిర్వహిస్తున్నట్టు జిల్లా ఉపాధి కల్పనాధికారి డి.అరుణ సోమవారం ఒక ప్రకటలో తెలిపారు. అమర్‌రాజా బ్యాటరీస్‌లో మిషన్ ఆపరేటర్స్-250, అప్రంటీస్ ట్రైనీ-250, ఎయిర్టెల్ పేమెంట్ బ్యాంకులో బిజినెస్ డెవలప్మెంట్ ఎగ్జిక్యూటివ్స్-60 ఉద్యోగాలకు ఐటీఐ, ఇంటర్, డిగ్రీ ఉత్తీర్ణులైన వారు అర్హులని పేర్కొన్నారు. ఎంపికైన వారు చిత్తూరు, శ్రీకాకుళం, విజయగరం జిల్లాలో పనిచేయాల్సి ఉంటుందని తెలిపారు. ఆసక్తి ఉన్న అభ్యర్థులు తమ పేర్లను ముందుగా ఎంప్లాయిమెంట్.ఏపీ.జీఓవి.ఇన్ వెబ్‌సైట్‌లో నమోదు చేసుకొని ఆ రోజు ఉదయం 10 గంటలకు స్థానిక వీటీ అగ్రహారం బీసీ కాలనీలోని ప్రభుత్వ ఐటీఐలో జరిగే ఇంటర్వ్యూకి నేరుగా హాజరుకావాలని కోరారు. పూర్తి వివరాల కోసం సెల్:89191 79415 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

కబేళా మూసివేతకు డిమాండ్



పశువుల కబేళాను శాశ్వతంగా మూసివేయాలని కోరుతూ జేసీకి వినతినిస్తున్న గోసంరక్షకులు

విజయనగరం క్రైమ్: జిల్లా కేంద్రంలోని కొత్తపేటలో ఉన్న సోహేల్ అహ్మద్ భవంతిలో నిర్వహిస్తున్న పశు కబేళాను శాశ్వతంగా మూసివేయించాలని గో సంరక్షకులు ఛాయాదేవి, పద్మనాభం, శ్యామ్‌సుందర్, నాగరాజు శర్మ తదితరులు కలెక్టర్ అంబేడ్కర్‌కు సోమవారం వినతి పత్రం అందజేశారు. అక్రమ కబేళాను నేల మట్టం చేయాలన్నారు. సమస్యను తెలియపర్చిన వెంటనే స్పందించి కబేళాలోని గోవులను రక్షించిన కలెక్టర్‌తో పాటు ఎస్పీ వకుల్‌జిందాల్, ఎమ్మెల్యే అదితి గజపతిరాజు, టూటౌన్ సీఐ కోరాడ రామారావు, మున్సిపల్ కమిషనర్ మల్లయ్యనాయుడుకు కృతజ్ఞతలు తెలిపారు.

అవయవ దానం గొప్పది



గజపతినగరంలో అవయవదానంపై అవగాహన ర్యాలీ

గజపతినగరం: అవయవ దానం గొప్పదని, దీనిపై ప్రతీ ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని నాబార్డు డీడీఎం టి.నాగార్జున తెలిపారు. గజపతినగరం మండల కేంద్రంలో అవయవ దానంపై అవగాహన కల్పిస్తూ సోమవారం ర్యాలీ నిర్వహించారు. విద్యార్థులతో కలిసి మానవహారం నిర్వహించారు. అవయవ దానం వల్ల ఆపదలో ఉన్నవారిని రక్షించుకునే విధానాన్ని వివరించారు. కేంద్ర ఆరోగ్య మంత్రిత్వశాఖ సూచనల మేరకు ప్రతి జిల్లాలోనూ అవయవదానంపై అవగాహన కల్పిస్తున్నట్టు వెల్లడించారు. కార్యక్రమంలో గజపతినగరం ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ జగదీష్, రెడ్‌క్రాస్ చైర్మన్ ప్రసాద్, ఆదిత్య కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాస్, విద్యార్థులు పాల్గొన్నారు.

వడ్డీ వేధింపులు ఆపండి



కలెక్టరేట్ ఎదుట ఆందోళన చేస్తున్న టిడ్కో ఇళ్ల వడ్డీ బాధితులు

విజయనగరం పట్టణ పరిధిలోని సారిపల్లి, సోనియానగర్ ప్రాంతాల్లోని టిడ్కో ఇళ్ల లబ్ధిదారులపై బ్యాంకర్ల వడ్డీ వేధింపులు ఆపాలని కోరుతూ కలెక్టరేట్ వద్ద సోమవారం ఆందోళన చేశారు. అనంతరం జేసీ కె.కార్తీక్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. గత జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం నిర్మాణాలు పూర్తిచేసి ఇళ్లు అప్పగించిందని, కూటమి ప్రభుత్వం వచ్చాక బ్యాంకర్ల నుంచి వడ్డీ వేధింపులు ప్రారంభమయ్యాయని పలువురు లబ్ధిదారులు వాపోయారు. తీసుకున్న రుణం రూ.3.5 లక్షలైతే వడ్డీ బకాయి రూ.70 వేలకు పైగా బ్యాంకర్లు చూపెడుతున్నారన్నారు. తక్షణమే చెల్లించకపోతే ఫ్లాట్‌లను జప్తుచేసి వేలం వేసేస్తామని తాజాగా నోటీస్‌లను పంపారన్నారు. జేసీని కలిసి వినతి పత్రాన్ని అందజేసిన వారిలో నాగేశ్వరరావు, ఈశ్వరమ్మ, పూజిత, బంగారమ్మ, పద్మ, మంగ, రాధ, నిర్మల, ఆదిలక్ష్మి, జయ తదితరులు ఉన్నారు.

– విజయనగరం అర్బన్

ఉపాధ్యాయుల నిరసన

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ బీమా (ఏపీజీఎల్ఐ)లో ఉపాధ్యాయులు దాచుకుంటున్న నిధుల లావాదేవీల్లో ఎదుర్కొంటున్న సమస్యలను తక్షణమే పరిష్కరించాలని యూటీఎఫ్ జిల్లా కమిటీ డిమాండ్ చేసింది. ఈ మేరకు సోమవారం ఏపీజీఎల్ఐ కార్యాలయం ఎదుట సంఘ ప్రతినిధులు నిరసన తెలిపారు. అనంతరం ఏపీజీఎల్ఐ ఏసీ హైమావతికి వినతిపత్రాన్ని అందజేశారు. ఉద్యోగుల జీతం నుంచి తగ్గించిన మొత్తానికి బాండ్లు, రుణాల మంజూరు, క్లెయిమ్‌ల పరిష్కారంలో కాలయాపన చేస్తున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. దీనిపై ఏసీ స్పందిస్తూ ఈ నెల 30వ తేదీలోగా సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో సంఘ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జేఏసీ పట్నాయక్, జేపీఆర్‌కే ఈశ్వరరావు, సంఘ రాష్ట్ర కార్యదర్శి రెడ్డి మోహనరావు, సీహెచ్ తిరుపతిరావు, పి.వాసుదేవరావు తదితరులు పాల్గొన్నారు.

– విజయనగరం అర్బన్



ఏపీజీఎల్ఐ కార్యాలయం ఎదుట యూటీఎఫ్ ప్రతినిధుల నిరసన ప్రదర్శన

ఇదేం ఆటవిక పాలన?



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న జెడ్పీ చైర్మన్, వైఎస్సార్‌సీపీ డిప్యూటీ రీజనల్ కో ఆర్డినేటర్ మజ్జి శ్రీనివాసరావు

- సామాన్యులపై రాజకీయ వేధింపులు
- ఉమ్మడి విజయనగరం జిల్లాలో పెచ్చుమీరుతున్న దిగువ స్థాయి నాయకుల పెత్తనం
- గడిచిన 50 రోజుల్లో వ్యక్తిగత దాడులు, ఆస్తులు విధ్వంసాలు
- చిరుద్యోగులను విధులు నుంచి తొలగిస్తామంటూ హెచ్చరికలు
- అధికారపార్టీ నాయకుల ఒత్తిళ్లకు తలొగ్గుతున్న అధికారులు
- ఉమ్మడి జిల్లాల కలెక్టర్లు స్పందించి అధికారులకు భరోసా ఇవ్వాలి
- జెడ్పీ చైర్మన్, వైఎస్సార్‌సీపీ రీజనల్ డిప్యూటీ కో ఆర్డినేటర్ మజ్జి శ్రీనివాసరావు

సాక్షి ప్రతినిధి, విజయనగరం / విజయనగరం: శాంతియుతమైన ఉమ్మడి విజయనగరం జిల్లాలో ఇటీవల అధికారంలోకి వచ్చిన కూటమి నేతలు ఆటవిక, అరాచక పాలనకు తెరలేపారని జిల్లా పరిషత్ చైర్మన్, వైఎస్సార్‌సీపీ రీజనల్ డిప్యూటీ కో ఆర్డినేటర్ మజ్జి శ్రీనివాసరావు ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో ఎన్నడూ లేని విధంగా సామాన్యులు, ప్రభుత్వ ఉద్యోగులపై రాజకీయ వేధింపులకు పాల్పడడం, వైఎస్సార్‌సీపీ సానుభూతిపరుల ఆస్తులు ధ్వంసం చేయడం తగదన్నారు. కేవలం ఆయా నియోజక వర్గాల్లోని దిగువస్థాయి నాయకులు పెత్తనాలు చెలాయించి భయభ్రాంతులకు గురిచేయడాన్ని తప్పుబట్టారు. ధర్మపురిలోని సిరిసహస్ర రైజింగ్ ప్యాలెస్‌లో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రజాస్వామ్యంలో ఐదేళ్లకు ఒకసారి ఎన్నికలు జరగడం, ప్రజాతీర్పు మేరకు ప్రభుత్వాలు ఏర్పడడం సర్వసాధారణమన్నారు. ఎన్నికలు అనంతరం ఏ పార్టీ విజయం సాధించి అధికారంలోకి వచ్చినా... ఏ పార్టీ ప్రతిపక్షంలో ఉన్నా జిల్లా సంస్కృతి ప్రకారం ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీల అమలుపై దృష్టి సారిస్తారే తప్ప ఇటువంటి కక్ష పూరిత చర్యలు ఎన్నడూ చూడలేదన్నారు. ఇటువంటి ఘటనలపై ఉమ్మడి జిల్లాల కలెక్టర్లు స్పందించి దిగువస్థాయి ఉద్యోగులకు భరోసా కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. రాజకీయ వేధింపులు, ఆస్తుల విధ్వంసంపై విచారణ జరిపించి బాధ్యుతలపై చర్యలు తీసుకోవాలని కోరారు.

- నెల్లిమర్ల మండలం దన్నానపేట గ్రామంలో వైఎస్సార్‌సీపీ సానుభూతిపరుడైన మాజీ సైనికుడు గ్రామ స్థలాన్ని ఆక్రమించుకున్నారంటూ ఈ నెల 25న నోటీసుజారీ చేసి 26న తొలగించనున్నట్టు చెప్పి మరుసటిరోజు 27న భారీ పోలీస్ బలగాలతో చుట్టుముట్టి తొలగింపు చర్యలు చేపట్టడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. ఇటువంటి సంస్కృతి ఎన్నడూ జిల్లాలో చూడలేదన్నారు. అధికారులు సైతం అత్యుత్సాహాన్ని ప్రదర్శించడం తగదని పేర్కొన్నారు. సదరు ఆక్రమణ ఆరోపణలపై గత ప్రభుత్వ హయాంలోనే నోటీసులు జారీ చేసిన విషయాన్ని ప్రస్తావించారు.
- విజయనగరం జిల్లా కేంద్రంలోని రింగ్‌రోడ్ ప్రాంతంలో ఉపాధి కోసం పెట్టుకున్న వాటర్ సర్వీసెంట్ సెంటర్‌ను కేవలం ఒక్క రోజులోనే కూల్చేయడం సమంజసమా అని ప్రశ్నించారు. ఉదయం కార్పొరేషన్ అధికారులు వచ్చి మధ్యాహ్నం కూల్చివేశారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆక్రమణలు నిజమైతే నోటీసులిచ్చి వివరణ ఇచ్చిన అనంతరం చర్యలు చేపట్టాల్సి ఉండగా... సదరు స్థలంలో ఉన్న సామగ్రిని తీసుకోకుండా కూల్చివేయడం భావ్యంకాదన్నారు.
- తెర్లాం మండల కేంద్రంలో ఇరిగేషన్ కాలువ కింద చేపట్టిన నిర్మాణాన్ని అధికారులంతా వెళ్లి తొలగించారన్నారు. సుమారు 30 మంది వరకు ఆ ప్రాంతంలో నిర్మాణాలు చేపడితే వైఎస్సార్‌సీపీ సానుభూతిపరుని నిర్మాణం తొలగించడం కక్ష సాధింపు చర్య కాదా అంటూ నిలదీశారు.
- కురుపాం నియోజకవర్గం జియ్యమ్మవలస మండలంలోని బిత్తరపాడు సచివాలయంలో ఇంజినీరింగ్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్న దివ్యాంగుడిని ఎటువంటి కారణం లేకుండా సీతంపేటకు ఆకస్మికంగా బదిలీ చేయించారన్నారు. జెడ్పీ చైర్మన్ హోదాలో అధికారులతో మాట్లాడిన అనంతరం సీతానగరం బదిలీ చేశారన్నారు.
- సాలూరు నియోజకవర్గంలోని ఐసీడీఎస్ ప్రాజెక్టులో విధులు నిర్వహిస్తున్న ఓ మహిళను ఉద్యోగం నుంచి తొలగిస్తామని బెదిరించడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. ఆమె తప్పుచేస్తే తొలగించడంలో తప్పులేదని, ఎటువంటి ఆరోపణలు లేకుండా కక్ష సాధించడం సరికాదన్నారు.
- ఎస్.కోట నియోజకవర్గం పరిధిలోని ఎల్.కోటలో 18 మందిని, వేపాడలో 9 మందిని, కొత్తవలసలో 5 మంది బుక్‌కీపర్‌లు మొత్తంగా 34 మందిని ప్రజాప్రతినిధుల ఒత్తిళ్ల మేరకు తొలగించి కొత్తవారిని నియమిస్తామని చెబుతున్నారన్నారు. ఇదే విషయమైన సంబంధిత మంత్రి దృష్టికి తీసుకెళ్తే అటువంటి చర్యలు చేపట్టలేదని చెబుతున్నారన్నారు. ఆ చిరుద్యోగులకు బాధ్యతలు అప్పగించకుండా ఇబ్బందులకు గురిచేయడం తగదన్నారు.
- పాఠశాలల్లో మధ్యాహ్నభోజన పథకం నిర్వాహకులను తొలగిస్తామంటూ రాజకీయ ఒత్తిళ్లకు దిగడం దారుణమన్నారు. విధులు మానుకోవాలంటూ హెచ్చరికలు చేయడం సమంజసం కాదన్నారు.
- చీపురుపల్లి నియోజకవర్గంలోని మెరకముడిదాం మండలం పరిధిలో జి.ములగాం గ్రామానికి చెందిన రెండు రేషన్ డిపో డీలర్లపై 6ఏ కేసులు నమోదుచేసి సంబంధిత డీలర్లను తొలగించేందుకు ప్రయత్నాలు చేశారన్నారు. అందులో ఒక వ్యక్తి న్యాయస్థానానికి వెళ్లి అనుకూలంగా తీర్పు తెచ్చుకోగా... మరో డీలర్‌కు ఎటువంటి నోటీసులు ఇవ్వకుండా అధికారులే తొలగించామంటూ చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు.
- గజపతినగరం నియోజకవర్గంలోని కెంగువ పంచాయతీలో 33 ఏళ్లుగా వినియోగించుకుంటున్న పంప్ సెట్ స్థలం గ్రామ కంఠంలో ఉందని వెంటనే తొలగించాలని నోటీసులు జారీ చేశారన్నారు.
- గత నెల 18న బొద్దాంలో, బొబ్బిలి పట్టణంలో వైఎస్సార్‌సీపీ సోషల్ మీడియా కార్యకర్తలపై దాడికి పాల్పడ్డారన్నారు.
- గుర్ల మండలం చింతలపేట గ్రామంలో 33 మంది పింఛన్లు తొలగించాలంటూ అధికార పార్టీ నాయకులు ఒత్తిళ్లు చేస్తున్నారన్నారు. సంబంధిత మంత్రి అటువంటి ప్రక్రియ చేపట్టడటం లేదని చెబుతుంటే దిగువ స్థాయి నాయకులు అత్యుత్సాహం ప్రదర్శిస్తున్నారన్నారు.
- ప్రకృతి వ్యవసాయంలో విధులు నిర్వహిస్తున్న చిరుద్యోగులను కొత్త ప్రభుత్వం వచ్చిన వెంటనే బదిలీలు చేయటం, తొలగింపు చర్యలు చేపట్టారన్నారు. జిల్లాలోని పలు ప్రాంతాల్లో ఫీల్డ్ అసిస్టెంట్‌లపై ఒత్తిడి తీసుకువచ్చి విధులు నుంచి తప్పించేలా ప్రయత్నాలు చేయడం సరికాదన్నారు. సమావేశంలో పార్టీ నాయకులు నెక్కల నాయుడుబాబు, కె.వి.సూర్యనారాయణరాజు, పతివాడ అప్పలనాయుడు పాల్గొన్నారు.

వేతన వెతలు



విజయనగరం మండలంలో పనిచేస్తున్న వేతనదారులు (ఫైల్)

- ఉపాధిహామీ వేతనదారులకు అందని వేతనాలు
- రెండునెలలుగా ఎదురుచూపు
- బ్యాంకు ఖాతాలకు చేరని కష్టార్జితం
- 22వేల పనిదినాలకు నిలిచిన చెల్లింపులు
- చెల్లించాల్సిన నిధులు రూ.55లక్షలు

విజయనగరం ఫోర్ట్: ఎండనక, వాననక ఉపాధిహామీ పనుల్లో పాల్గొన్నారు. నాలుగు డబ్బులు వస్తే అవసరాలు తీరుతాయని ఆశించారు. రెండు నెలలుగా వేతనాలు అందక పోవడంతో వేతనదారులు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వేతనాలు చెల్లించాలని అధికారులు, ఉపాధిహామీ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నా ఫలితం లేకపోవడంతో ఆవేదన చెందుతున్నారు. గత ప్రభుత్వ హయాంలో పనిచేసిన వారం డబ్బులు రెండు మూడు రోజులకే ఖాతాలకు డబ్బులు జమయ్యేవని, ఇప్పుడు వేతనాల కోసం ఎదురుచూడాల్సిన దుస్థితి నెలకొందని వాపోతున్నారు.

నిలిచిన చెల్లింపులు

జిల్లాలో 3.45 లక్షల జాబ్‌కార్డులు, 6.05 లక్షల మంది వేతనదారులు ఉన్నారు. వీరిలో ఈ ఏడాది 3 లక్షల జాబ్‌కార్డుల్లో పేర్లు నమోదైన 4.46 లక్షల మంది ఉపాధిహామీ పనుల్లో పాల్గొన్నారు. మే 21వ తేదీ నుంచి వేతనదారులకు వేతనాలు జమకావడం లేదు. జిల్లాలో మొత్తం 22 వేల పనిదినాలకు రూ.55 లక్షల మేర వేతన చెల్లింపులు నిలిచిపోయాయి. డబ్బులు ఎప్పుడు చెల్లిస్తారా అని వేతనదారులు ఎదురుచూస్తున్నారు. ఉపాధిహామీ పనుల్లో పాల్గొనేవారంతా చిన్న, సన్నకారు రైతులు, వ్యవసాయ కూలీలే. ప్రస్తుత ఖరీఫ్ సమయంలో పెట్టుబడికి డబ్బులు లేక సతమతమవుతున్నారు. ఇప్పటికే అందాల్సిన పెట్టుబడి భరోసా డబ్బులను ప్రభుత్వం చెల్లించలేదు. కనీసం చేసిన పనికి వేతనం చెల్లింపులోనూ జాప్యం చేయడంపై మండిపడుతున్నారు.

రెండు నెలలుగా వేతనాలు అందలేదు



నేను గత పదేళ్లుగా ఉపాధి హామీ పనికి వెళ్తున్నాను. ఈ ఏడాది కూడా వెళ్లాను. మే 21వ తేదీ తర్వాత నుంచి పనిచేసిన కాలానికి వేతనాలు బ్యాంకు ఖాతాకు జమకాలేదు. ఉపాధి హామీ సిబ్బందిని ప్రశ్నిస్తే తెలియదని సమాధానం చెబుతున్నారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో వారంరోజులు పనిచేసిన తర్వాత 2, 3 రోజుల్లో వేతనాలు బ్యాంకు ఖాతాలో జమయ్యేవి. ఇది పెట్టుబడి సమయం. వేతనాల చెల్లింపునకు ప్రభుత్వం చొరవచూపాలి.

– నాగేశ్వరరావు, వేతనదారు, విజయనగరం

వేతన బకాయిలు నిజమే..

వేతన బకాయిలు ఉన్న మాట వాస్తవమే. జిల్లాలోని ఉపాధిహామీ వేతనదారులకు 22 వేల పనిదినాలకు సంబంధించిన వేతనాలు అందాల్సి ఉంది. ప్రభుత్వం నుంచి రాగానే వేతనదారులకు చెల్లిస్తాం.

– జి.ఉమాపరమేశ్వరి, పీడీ, డ్వామా

రహదారి భద్రతపై ప్రత్యేక నిఘా

- ఎస్పీ వకుల్ జిందాల్
- మైనర్, ట్రిపుల్, డేంజర్ డ్రైవింగ్, డిఫెక్టివ్ నంబర్ ప్లేట్స్‌పై ప్రత్యేక డ్రైవ్
- రోడ్డు నిబంధనలు అతిక్రమించిన 87 బైకులు, ఆటో సీజ్



బైక్‌లు మైనర్లకు కౌన్సిలింగ్ చేస్తున్న జిల్లా ఎస్పి వకుల్ జిందల్

విజయనగరం క్రైమ్: రహదారి భద్రతపై ప్రత్యేక నిఘా వేయాలని, రోడ్డు నిబంధనలు పాటించని వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఎస్పీ వకుల్ జిందాల్ పోలీస్ అధికారులను ఆదేశించారు. ఈ మేరకు జిల్లా వ్యాప్తంగా పోలీస్‌లు సోమవారం వాహన తనిఖీలు చేపట్టారు. మైనర్ డ్రైవింగ్, ట్రిపుల్ డ్రైవింగ్, సౌండ్ పొల్యూషన్, డేంజరస్ డ్రైవింగ్, డిఫెక్టివ్ నంబర్ ప్లేట్‌లు ఉన్న వాహనాలపై ప్రత్యేక దృష్టిసారించారు. పట్టణంలోని ట్రాఫిక్ డీఎస్పీ డి.విశ్వనాథ్ ఆధ్వర్యంలో ట్రాఫిక్ సీఐ రంగనాథ్, ఎస్‌ఐలు త్రినాథరావు, లోవరాజు, ఎ.ఎం.రాజు, శంబాన రవి తదితరులు దాసన్నపేట, ఐస్ ఫ్యాక్టరీ జంక్షన్, ఆర్టీసీ కాంప్లెక్స్, కోట జంక్షన్, కలెక్టరేట్ ప్రాంతాల్లో ప్రత్యేక డ్రైవ్ చేపట్టి వాహన తనిఖీలు చేశారు. వీటిని ఎస్పీ పర్యవేక్షించారు. మైనర్ డ్రైవింగ్ చేసి పట్టుబడిన వారికి స్వయంగా కౌన్సెలింగ్ చేశారు. మైనర్లు వాహనాలు నడిపితే తల్లిదండ్రులు, సంబంధిత వాహన యజమానులపై కేసులు నమోదుచేస్తామని హెచ్చరించారు. పరిమితికి మించి ప్రయాణికులతో నడిపే ఆటోవాలాలపై చర్యలు తప్పవన్నారు. పట్టణంలో ట్రాఫిక్ పోలీసులు చేపట్టిన స్పెషల్ డ్రైవ్‌లో ట్రిపుల్ డ్రైవింగ్ కింద 10 మంది, మైనర్ డ్రైవింగ్‌లో 61 మంది, సౌండ్ పొల్యూషన్‌కు పాల్పడిన ముగ్గురు, అపాయకరంగా వాహనాలు నడిపిన ఒకరిపై కేసులు నమోదుచేశారు. డిఫెక్టివ్ నంబర్ ప్లేట్లు కలిగిన నలుగురు వాహనదారులపైన, డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనాలు నడిపిన వారిపై 16 కేసులు నమోదుచేసి, 87 బైకులు, ఒక ఆటోను సీజ్ చేసినట్టు ఎస్పీ వకుల్ జిందాల్ తెలిపారు.

పారిశుద్ధ్యం, తాగునీటి సమస్యల పరిష్కారానికి చర్యలు



పోస్టర్‌ను విడుదలచేసిన జేసీ కార్తీక్

విజయనగరం అర్బన్:

జిల్లాలోని గ్రామీణ ప్రాంతాల్లో పారిశుద్ధ్యం, తాగునీటి సమస్యలను వెంటవెంటనే పరిష్కారించాలన్న ఉద్దేశంతో కమాండ్ కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసినట్టు జాయింట్ కలెక్టర్ కె.కార్తీక్ తెలిపారు. దీనికి సంబంధించిన పోస్టర్‌ను సోమవారం ప్రజాసమస్యల పరిష్కార వేదికలో ఆవిష్కరించారు. పంచాయతీరాజ్ విభాగం ఆధ్వర్యంలో సెల్: 95023 49267 నంబర్‌తో కంట్రోల్ రూమ్ పనిచేస్తుందని జిల్లా పంచాయతీరాజ్ ఆధికారి శ్రీధర్‌రాజ్ తెలిపారు. ఏ గ్రామంలో పారిశుద్ధ్యం, తాగునీటి సమస్యలు ఉన్నా ఈ ఫోన్ నంబర్‌కు తెలియజేయవచ్చన్నారు. కార్యక్రమంలో డీఆర్‌ఓ అనిత పాల్గొన్నారు.

పారా ఒలింపిక్ విజేతకు ఘన సత్కారం

విజయనగరం టౌన్: ఇటీవల బెంగళూరులో జరిగిన జాతీయ పారా ఒలింపిక్ అథ్లెటిక్స్ పోటీల్లో విజేతగా నిలిచి బంగారు పతకం సాధించిన క్రీడాకారుడు బండారు లక్ష్మణ్ యాదవ్‌ను యాదవ హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు ఇసరపు శేఖర్ యాదవ్ ఘనంగా సత్కరించారు. స్థానిక ప్రదీప్‌నగర్‌లో ఉన్న సమితి కార్యాలయంలో సోమవారం నిర్వహించిన సత్కార కార్యక్రమంలో శేఖర్ మాట్లాడుతూ యాదవ జాతి ఆణిముత్యం లక్ష్మణ్ అని, 2028లో జరగబోయే పారా ఒలింపిక్స్‌లో కూడా రాణించి రాష్ట్రానికి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. దివ్యాంగులందరూ లక్ష్మణ్ యాదవ్‌ను స్ఫూర్తిగా తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో కృష్ణారెడ్డి అకాడమీ చైర్మన్ కృష్ణారెడ్డి, దాకవరపు రాము యాదవ్ తదితరులు పాల్గొన్నారు.



లక్ష్మణ్‌యాదవ్‌ను సత్కరిస్తున్న యాదవహక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు ఇసరపు శేఖర్‌యాదవ్

అవసరాలకు అనుగుణంగా నైపుణ్య శిక్షణ

- నైపుణ్య కమిటీ సమావేశంలో జేసీ కే.కార్తీక్

విజయనగరం అర్బన్:

స్థానిక అవసరాలకు అనుగుణంగా యువతకు నైపుణ్య శిక్షణ ఇవ్వాలని జాయింట్ కలెక్టర్ కె.కార్తీక్ సూచించారు. దీనివల్ల స్థానికంగానే ఉపాధి లభిస్తుందని తెలిపారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో సోమవారం జిల్లా నైపుణ్య కమిటీ సమావేశం జరిగింది. సంకల్ప్ కార్యక్రమం గురించి ముందుగా డీఆర్‌డీఏ పీడీ ఎ.కళ్యాణ్ చక్రవర్తి పవర్‌పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా వివరించారు. అకడమిక్, ఎస్‌బీఐ ఆర్‌సెట్, సీడాప్, నైరేడ్, జన శిక్షణ సంస్థాన్, ఎన్‌ఏసీ తదితర సంస్థలు ఇస్తున్న శిక్షణ కార్యక్రమాలు, కల్పిస్తున్న ఉద్యోగాలను ఆయా సంస్థల ప్రతినిధులు తెలియజేశారు. ఈ సందర్భంగా జేసీ కార్తీక్ మాట్లాడుతూ వాస్తవిక అవసరాలను గుర్తించి వాటికి అనుగుణంగా శిక్షణ ఇవ్వడం ద్వారా యువతకు ఉపాధి అవకాశాలు అధికంగా లభించే అవకాశం ఉంటుందన్నారు. భోగాపురం విమానాశ్రయ నిర్మాణం జోరుగా జరుగుతోందని, ఇక్కడ సేవారంగంలో ఉపాధి అవకాశాలు ఎక్కువ లభించే అవకాశం ఉందన్నారు. ఆ మేరకు శిక్షణ కార్యక్రమాలకు రూపకల్పన చేయాలన్నారు. శిక్షణ, ఉపాధి కల్పనలో దివ్యాంగులకు ప్రాధాన్యమివ్వాలని జేసీ కోరారు. సమావేశంలో స్కిల్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ గోవిందరావు, నాబార్డు డీడీఎం నాగార్జున, మెప్మా పీడీ సుధాకరరావు, పశు సంవర్ధక శాఖ జేడీ డాక్టర్ వై.వి.రమణ, ఉద్యానశాఖ డీడీ జమదగ్ని, మత్స్యశాఖ డీడీ నిర్మలాకుమారి, జిల్లా ఉపాధి కల్పనాధికారి డి.అరుణ, ప్రభుత్వ ఐటీఐ ప్రిన్సిపాల్ టి.వి.గిరి, వివిధ శిక్షణ సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జేసీ కె.కార్తీక్

క్లుప్తంగా

లైంగిక వేధింపులకు పాల్పడితే చర్యలు


బుక్‌లెట్‌ను ఆవిష్కరిస్తున్న జేసీ శోభిక తదితరులు

పార్వతీపురం: కార్యాలయాలు, విద్యాలయాల్లో లైంగిక వేధింపులకు పాల్పడితే సంబంధిత వ్యక్తులపై చర్యలు చేపట్టనున్నామని జాయింట్ కలెక్టర్ ఎస్ఎస్ శోభిక హెచ్చరించారు. ఈ మేరకు సోమవారం లైంగిక వేధింపులకు సంబంధించిన బుక్‌లెట్‌ను కలెక్టరేట్‌లో ఆమె ఆవిష్కరించారు. లైంగిక వేధింపులపై మహిళలకు మరింత అవగాహన కల్పించాలని ఈ సందర్భంగా పిలుపునిచ్చారు. ఎవరైనా లైంగిక వేధింపుల బారిన పడితే బాధితులు తక్షణం ఫిర్యాదు చేయాలని కోరారు. కార్యక్రమంలో ఆర్డీఓ కె.హేమలత, ఐసీడీఎస్ పీడీ ఎంఎం రాణితోపాటు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

80 లీటర్ల సారాతో వ్యక్తి అరెస్టు


సారా కేన్లతో నిందితుడు జమ్మయ్య

సాలూరు రూరల్: మోటార్ సైకిల్‌పై సారా తరలిస్తున్న నిందితుడిని రూరల్ ఎస్సై వెంకటరమణ సోమవారం సాయంత్రం పట్టుకుని కేసు నమోదు చేశారు. ఈ కేసు వివరాలిలా ఉన్నాయి మండలంలోని దళాయివలస గ్రామ సమీపంలో సిబ్బందితో కలిసి రూరల్ ఎస్సై విధులు నిర్వహిస్తుండగా మోటారు సైకిల్‌పై వెళ్తున్న వ్యక్తిని ఆపి పరిశీలించి రెండు ప్లాస్టిక్ క్యాన్లతో సారాను గుర్తించారు. ఆ రెండు క్యాన్లలో ఉన్న 80 లీటర్ల సారాతో పాటు మోటార్ సైకిల్‌ను సీజ్ చేసినట్లు ఎస్సై తెలిపారు. ఇదిలా ఉండగా నిందితుడిని దిగువ మెండంగికి చెందిన మచ్చ జమ్మయ్యగా గుర్తించినట్లు ఎస్సై పేర్కొన్నారు.

12 కిలోల గంజాయి పట్టివేత

భామిని: ఒడిశా నుంచి అక్రమంగా తరలిస్తున్న సుమారు 12 కిలోల గంజాయిని భామిని మండలంలోని బత్తిలిలో పోలీసులు పట్టుకుని, ఇద్దరు నిందితులను సోమవారం అదుపులోకి తీసుకున్నారు. పార్వతీపురం మన్యం జిల్లా ఎస్పీ మాధవరెడ్డి ఆదేశాల మేరకు బత్తిలి వద్ద ఏర్పాటు చేసిన అంతర్రాష్ట్ర చెక్‌పోస్టు వద్ద చేపట్టిన తనిఖీలో ఒడిశా నుండి ప్రైవేట్ బస్సులో తరలిస్తున్న గంజాయి పట్టుబడింది. పాలకొండ సీఐ చంద్రమౌళి, ఎస్సై ప్రసాద్‌లు గంజాయి అక్రమ రవాణాపై దర్యాప్తు నిర్వహిస్తున్నారు.

వ్యక్తి అదృశ్యం


శంకరరావు (ఫైల్)

కొత్తవలస: మండల కేంద్రానికి చెందిన గుదే శంకరరావు (60) రెండు రోజుల నుంచి కనిపించకపోవడంతో ఆయన కుమారుడు గణేష్ స్థానిక పోలీస్ స్టేషన్‌లో సోమవారం ఫిర్యాదు చేశారు. ఈ మేరకు ఏఎస్సై రహమాన్ కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. కేసు వివరాలిలా ఉన్నాయి. కొత్తవలసలోని విజయనగరం రోడ్డులో హెచ్‌పీ గ్యాస్ ఏజెన్సీ కార్యాలయం సమీపంలో అరటి పళ్ల దుకాణం పెట్టుకుని శంకరరావు జీవనం సాగిస్తున్నాడు. ఈనెల 26వ తేదీన ఇంటినుంచి దుకాణానికి వెళ్లి తిరిగి రాలేదని నాటి నుంచి తెలిసిన వారు, బంధువుల ఇళ్ల వద్ద వెతికినా ప్రయోజనం లేకపోయిందని బాధితులు ఫిర్యాదులో పేర్కొన్నట్లు ఏఎస్సై తెలిపారు.

భార్య అనారోగ్యం: భర్త ఆత్మహత్య

గుర్ల: భార్య అనారోగ్యంతో బాధపడుతూ చికిత్స తీసుకుంటుండడంతో మనస్తాపం చెందిన భర్త గడ్డి మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గుర్ల మండలంలోని కెల్ల గ్రామంలో జరిగిన ఈ సంఘటన వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన అంపోలు లక్ష్మి వారం రోజులుగా అనారోగ్యంతో బాధపడుతూ జిల్లా కేంద్రంలోని ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతోంది. ఆమె అనారోగ్యంతో బాధపడుతుండడంతో మనస్తాపం చెందిన భర్త అప్పలనాయుడు (31) సోమవారం గడ్డి మందు తాగేశాడు. గమనించి కుటుంబసభ్యులు ఆస్పత్రికి తరలించినప్పటికీ ఫలితం లేకపోయింది. అప్పటికే అప్పలనాయుడు మృతి చెందినట్లు వైద్యాధికారులు ధ్రువీకరించారు. ఫిర్యాదు మేరకు ఎస్సై భాస్కరరావు కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నారు.

మాజీ ఆర్మీ ఉద్యోగి ఉగ్రవాదా?

- ఎమ్మెల్సీ డాక్టర్ పెనుమత్స సురేష్
- ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఫిర్యాదు


మాజీ ఆర్మీ ఉద్యోగికి న్యాయం చేయాలని కోరుతూ అర్జీ ఇస్తున్న ఎమ్మెల్సీ డాక్టర్ పి.సురేష్

విజయనగరం అర్బన్: దేశ రక్షణలో భాగంగా ఉగ్రవాదులను ఎదుర్కొన్న జవాన్‌ను ఉగ్రవాదిలా అవమానించి 50 మంది పోలీసులు ఇంటిమీదకు వెళ్లడం దారుణమని ఎమ్మెల్సీ డాక్టర్ పెనుమత్స సురేష్ బాబు ఆగ్రహం వ్యక్తం చేశారు. నెల్లిమర్ల మండలం దనాన్నపేటలో మాజీ ఆర్మీ ఉద్యోగి వెంకునాయుడు ఇంటి ప్రహరీని అన్యాయంగా కూల్చివేశారని ఆ ఆదేశాలను పునఃపరిశీలించాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం ఆయన కలెక్టరేట్‌లో జరిగిన ప్రజా వినతుల పరిష్కార వేదికలో ఫిర్యాదు చేశారు. కార్యక్రమంలో ఆయనతోపాటు వైఎస్ఆర్‌సీపీ నాయకుడు శ్రీరాములునాయుడు, మాజీ ఆర్మీ ఉద్యోగి వెంకునాయుడు తదితరులు ఉన్నారు.

గడువులోగా వినతులకు పరిష్కారం: జేసీ కార్తీక్

ఏ రోజు వచ్చిన వినతులు ఆ రోజే చూడాలని నాట్‌వ్యూ ఉండకూడదని అలాగే వచ్చిన వాటిని గడువులోగా పరిష్కరించాలని జాయింట్ కలెక్టర్ కె.కార్తీక్ జిల్లా అధికారులను ఆదేశించారు. ఈ మేరకు సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజా వినతుల పరిష్కార వేదికకు వివిధ సమస్యలపై జిల్లా ప్రజలు అందజేసిన వినతులను ఆయన స్వీకరించారు. ఈ సందర్భంగా అధికారులతో జేసీ మాట్లాడుతూ అర్జీలు రీ ఓపెన్ అయిన వాటిని కూడా నిర్దేశిత గడువులోగా అధికారులు పంపాలని ఆన్‌లైన్‌లో ఏ స్టేజిలో కూడా పెండింగ్ కనపడకూడదన్నారు. ఎన్నికల ముందు పలు శాఖల వద్ద పెండింగ్ ఉన్న 18 వినతులు కలెక్టరేట్ ఆడిటోరియంలో నిర్వహించిన వినతుల స్వీకరణ కార్యక్రమంలో జేసీ కార్తీక్‌తో పాటు డీఆర్‌ఓ ఎస్‌డీ అనిత పాల్గొన్నారు. సోమవారం వివిధ సమస్యలపై ప్రజల నుంచి 205 వినతులు అందాయి.

ఎస్పీకి అందిన 35 ఫిర్యాదులు

విజయనగరం క్రైమ్: ప్రజల సమస్యల తక్షణ పరిష్కారానికి 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక' ఎంతగానో ఉపయోగపడుతుందని ఎస్పీ వకుల్ జిందాల్ పేర్కొన్నారు. ఈ మేరకు జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం ఆయన ప్రజల నుంచి 35 ఫిర్యాదులను స్వీకరించారు. ఈ సందర్భంగా ప్రజల సమస్యలను శ్రద్ధగా విని, సంబంధిత పోలీసు అధికారులతో వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడి, ఫిర్యాదుదారుల సమస్యల పరిష్కారానికి చట్టపరిధిలో చర్యలు చేపట్టి, న్యాయం చేయాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ అస్మాఫర్హీన్, డీటీసీ డీఎస్పీ ఎం.వీరకుమార్, డీసీఆర్‌బీ సీఐ జె.మురళి తదితరులు పాల్గొన్నారు.


ఎస్సైలుగా ఉద్యోగోన్నతి పొందిన వారిని అభినందిస్తున్న ఎస్పీ వకుల్ జిందాల్

ముగ్గురు ఏఎస్సైలకు పదోన్నతి

జిల్లాలో అసిస్టెంట్ సబ్ ఇన్‌స్పెక్టర్‌లుగా పనిచేస్తూ, ఇటీవల ఎస్సైలుగా ఉద్యోగోన్నతి పొందిన ముగ్గురు ఎస్సైలను ఎస్పీ వకుల్ జిందాల్ జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం అభినందించారు. పదోన్నతుల్లో భాగంగా జిల్లాలోని పోలీస్ కంట్రోల్ రూమ్‌లో పనిచేస్తున్న ఏఎస్సై ఎస్.అప్పారావు, గజపతినగరం స్టేషన్‌లో ఏఎస్సైగా పనిచేస్తున్న మాతామూర్తి, రామభద్రపురం స్టేషన్‌లో పనిచేస్తున్న ఎస్.చిన్నయ్యకు ఎస్సైలుగా ఉద్యోగోన్నతులు లభించాయి. వారిని తిరిగి విజయనగరం జిల్లాలో పనిచేసేందుకు గాను విశాఖ రేంజ్ డీఐజీ ఉత్తర్వులు జారీచేయడంతో జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీని వారు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆ ముగ్గురిని ఎస్పీ అభినందించి, ప్రజలకు మరింత మెరుగైన సేవలందించాలని పిలుపునిచ్చారు. త్వరలో జిల్లాలో పనిచేసేందుకు పోలీస్‌స్టేషన్‌లకు బదిలీ చేస్తామని, సమర్థవంతంగా పనిచేయాలని దిశానిర్దేశం చేశారు.

జిల్లా ప్రగతికి ప్రజల సహకారం కావాలి

- కలెక్టర్ శ్యామ్ ప్రసాద్


అర్జీలను స్వీకరిస్తున్న కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్

పార్వతీపురం: పార్వతీపురం మన్యం జిల్లాను అభివృద్ధి పథంలో నడిపించడానికి జిల్లా ప్రజల సహాయ సహకారాలు అవసరమని కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ అన్నారు. ఈ మేరకు సోమవారం కలెక్టరేట్‌లోని సెల్లార్‌లో జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొని వివిధ సమస్యలతో కలెక్టరేట్‌కు వచ్చిన దరఖాస్తుదారుల సమస్యలను ఓపికతో వినాలని, సమస్యను పరిష్కరించే దిశగా చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. కలెక్టర్‌తో పాటు జాయింట్ కలెక్టర్ ఎస్.ఎస్.శోభిక, ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి ఎస్.సేతు మాధవన్, ఆర్డీఓ కె.హేమలతతో కలిసి ప్రజల నుంచి 154 అర్జీలను స్వీకరించారు. అలాగే దివ్యాంగుల అర్జీలను జేసీ శోభిక వారివద్దకు వెళ్లి స్వీకరించారు. కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

పబ్లిక్ గ్రీవెన్స్‌కు 92 వినతులు

సీతంపేట: స్థానిక ఎస్ఆర్ శంకరన్ సమావేశ మందిరంలో ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి టి.రాహుల్‌కుమార్ రెడ్డి సోమవారం నిర్వహించిన పబ్లిక్ గ్రీవెన్స్‌కు 92 వినతులు వచ్చాయి. పోస్ట్‌మెట్రిక్ వసతిగృహాలు, వైటీసీల్లో వంటకుక్‌లు, కమాటీలుగా పనిచేస్తున్న 96 మంది తాత్కాలిక ఉద్యోగులకు అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులుగా మార్చాలని జీవో వచ్చినా ఇంతవరకు మార్చలేదని పలువురు సిబ్బంది వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో గిరిజన సంక్షేమశాఖ డీడీ అన్నదొర, ఈఈ సింహాచలం, డిప్యూటీ ఈవో నారాయుడు, ఏఎంవో కోటిబాబు, సీడీపీవో రంగలక్ష్మి, ఏపీడీ సన్యాసిరావు తదితరులు పాల్గొన్నారు.


సీతంపేట: వినతులు స్వీకరిస్తున్న పీవో రాహుల్‌కుమార్ రెడ్డి


పార్వతీపురం టౌన్: బాధితుల సమస్యలు తెలుసుకుంటున్న ఎస్పీ ఎస్‌వీ మధవ రెడ్డి

ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 7 ఫిర్యాదులు

పార్వతీపురం టౌన్: ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 7 ఫిర్యాదులు అందినట్లు పార్వతీపురం మన్యం జిల్లా ఎస్పీ ఎస్‌వీ మధవ రెడ్డి తెలిపారు. ఈ మేరకు సోమవారం ఆయన స్థానిక జిల్లా పోలీసు కార్యాలయంలో బాధితుల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఫిర్యాదుదారుల సమస్యలను తెలుసుకుని పూర్తి స్థాయిలో పరిష్కరిస్తామని బాధితులకు భరోసా కల్పించారు. ప్రతి సోమవారం జరిగే ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని, వారి సమస్యలు స్వేచ్ఛగా విన్నవించుకోవచ్చునని, వాటిపై చట్టపరిధిలో విచారణ జరిపి నిర్ణీత గడువులోగా పరిష్కరిస్తామని ఎస్పీ తెలిపారు. కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

సహారా ఇండియా బాధితుల ఆందోళన

- ఖాతాదారులను దగాచేస్తున్న సంస్థ అంటూ మండిపాటు
- తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేత


ఆందోళన చేస్తున్న బాధితులు


తహసీల్దార్‌కు వివరిస్తున్న దృశ్యం

బొబ్బిలి రూరల్: సహారా ఇండియా కంపెనీ కావాలనే బాధిత సభ్యులు, ఏజెంట్లను దగా చేస్తోందని ఆ కంపెనీ బాధితుల సంఘం ప్రతినిధులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు సోమవారం బొబ్బిలి తహసీల్దార్ కార్యాలయం వద్ద సీఐటీయూ ఆధ్వర్యంలో ఆందోళన చేశారు. అనంతరం తహసీల్దార్ ఎదుట తమగోడు వెళ్లగక్కారు. దేశవ్యాప్తంగా ఆ సంస్థ చేస్తున్న మోసాలపై ఆందోళన చేశామని, న్యాయస్థానాలు సైతం డబ్బు చెల్లింపులకు ఆదేశించాయన్నారు. దేశంలో 13కోట్లమంది ఖాతాదారులు సుమారు రూ.3లక్షల కోట్లు ఆ సంస్థలో డిపాజిట్లు, పొదుపు చేసుకున్నారని 12ఏళ్లుగా ఆ సొమ్ము తిరిగి ఇవ్వకుండా సంస్థ కపట నాటకాలతో బాధితులను మోసం చేస్తోందని వాపోయారు. ఇప్పటికే అనేకమంది సభ్యులు మృతిచెందగా, ఉన్నవారిని ఆసంస్థ క్షోభకు గురిచేస్తోందని ఆవేదన వ్యక్తంచేశారు. ఆ సంస్థ కార్యాలయాలన్నీ మూతపడ్డాయని, ఎక్కడికి వెళ్లి న్యాయం అడగాలో తెలియడం లేదని ప్రభుత్వం తగుచర్యలు తీసుకుని బాధితులకు న్యాయం చేయాలని కోరుతూ తహసీల్దార్ ఎం శ్రీనుకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు పి.శంకర్రావు, శ్రీను, ఈప్రాంత బాధితులు, ఏజెంట్లు పాల్గొన్నారు.

సమస్యలుంటే చెప్పండి

- జెడ్పీచైర్మన్ మజ్జి శ్రీనివాస రావు
- మండల సర్వసభ్య సమావేశానికి మంత్రి సంధ్యారాణితో పాటు హాజరు


సర్వసభ్య సమావేశంలో నాయకులతో కలిసి మాట్లాడుతున్న జెడ్పీచైర్మన్ మజ్జి శ్రీనివాసరావు

మెంటాడ: మండలానికి కావాల్సిన రోడ్లు, పీహెచ్‌సీ భవనం మరమ్మతులు, గ్రామాల్లో కావలసిన ఇంకా ఏమైనా ఉంటే మా దృష్టిలో పెట్టండని జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు కోరారు. ఈ మేరకు ఎంపీపీ రెడ్డి సన్యాసినాయుడు అధ్యక్షతన సోమవారం జరిగిన మెంటాడ మండల పరిషత్ సాధారణ సర్వసభ్య సమావేశానికి హాజరైన స్త్రీ శిశుసంక్షేమ శాఖ, గిరిజనశాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణితో కలిసి ఆయన మాట్లాడారు. సమస్యలేమైనా ఉంటే మంత్రి సంధ్యారాణితో చర్చించి పరిష్కరించనున్నట్లు ఇంజినీరింగ్ అధికారులు, నాయకులకు సూచించారు. గ్రీన్‌ఫీల్డ్ హైవే రోడ్డు పనుల్లో భాగంగా వచ్చి పోయే భారీ లారీల వల్ల గజపతినగరం నుంచి మెంటాడకు వచ్చే రహదారి గుంతలు పడి పాడైందన్నారు. తక్షణమే ఆ గుంతలను కప్పి, మెంటాడ నుంచి ఆంధ్ర వెళ్లే రహదారిలో రెండు వైపులా తాటి చెట్లు తొలగించాలని రోడ్లు, భవనాల శాఖాధికారులను ఆదేశించారు. సమావేశంలో మంత్రి గుమ్మడి సంధ్యారాణి మాట్లాడుతూ పీహెచ్‌సీ డాక్టర్లు ఈ సీజన్‌లో అందుబాటులో ఉండాలని, తప్పనిసరిగా హాస్టల్స్‌ను సందర్శించాలని స్పష్టం చేశారు. అన్ని గ్రామాల్లో శానిటేషన్ చేయించాలని ఆర్‌డబ్ల్యూఎస్, ఈవోపీఆర్‌డీలను ఆదేశించారు. సర్పంచ్‌లంతా శానిటేషన్ వారోత్సవాలను గ్రామాల్లో నిర్వహించాలని కోరారు. ఎంపీపీ రెడ్డి సన్యాసినాయుడు మాట్లాడుతూ పొలాల మధ్యలో నుంచి విద్యుత్ లైన్లు వెళ్లడం వల్ల వ్యవసాయ పనుల కాలంలో స్తంభాలు పడిపోతున్నాయని, అలాగే చెట్టుకొమ్మలు విరిగి పడుతున్నాయని చెప్పారు. ఆయా సమయాల్లో విద్యుత్ అధికారులు స్పందించి విద్యుత్‌లైన్లు రోడ్డు పక్కన వేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

ప్రోటోకాల్ పాటించాలి: మంత్రి ఆదేశాలు

అధికారులు ప్రోటోకాల్‌ను తప్పకుండా పాటించాలని వైస్ ఎంపీపీ పొట్టంగి దుర్గ కోరగా మంత్రి సంధ్యారాణి స్పందించారు. కచ్చితంగా స్థానిక సర్పంచ్‌లకు, ఎంపీటీసీలు, నాయకులకు ఏ కార్యక్రమమైన అధికారులు సమాచారం ఇవ్వాలని ఆదేశించారు. అప్పుడే ఏ కార్యక్రమమైనా విజయవంతమవుతుందని, మరోసారి ఇలాంటివి జరగకుండా చూడాలని అధికారులను ఆమె ఆదేశించారు.

విత్తనాలు, ఎరువుల నిల్వలపై సూచన

మండలంలోని చల్లపేట, ఆగూరు, లోతుగెడ్డలలో విత్తనాలు, ఎరువులు నిల్వలకు చోటు లేక అవస్థలు పడుతున్నామని మండల వ్యవసాయధికారి తెలిపారు. విత్తనాలు అందరికీ సరిపడా ఇచ్చామని, ఎరువులు కూడా గత ఏడాది స్టాకు ఉందని అవసరమైతే ఇంకా తెప్పిస్తామని ఆయన పేర్కొన్నారు. దీనికి జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాస రావు స్పందిస్తూ ఈ రెండు నెలలు తాత్కాలికంగా రేషన్ డిపోల్లో విత్తన, ఎరువుల నిల్వలు ఉంచేలా చూడండని అధికారులకు కోరారు.

విద్యార్థులకు నేత్ర పరీక్షలు

పార్వతీపురంటౌన్: విద్యార్థులందరూ నేత్ర పరీక్షలు చేయించుకోవాలని అంధత్వనివారణ సంస్థ పార్వతీపురం మన్యం జిల్లా అధికారి డాక్టర్ నగేష్ రెడ్డి పిలుపునిచ్చారు. ఈ మేరకు సోమవారం ఆయన జిల్లా ఆస్పత్రిలో ఉన్న జిల్లా అంధత్వ నివారణ సంస్థ కార్యాలయంలో నేత్ర వైద్యాధికారులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా ఆగస్టు 1వ తేదీ నుంచి అక్టోబర్ 31వరకు పాఠశాల విద్యార్థులకు నేత్ర పరీక్షల కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జిల్లాలో పనిచేస్తున్న నేత్ర వైద్యాధికారులు, నేత్ర వైద్య సహాయకులు విద్యార్థులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా చూడాలని సూచించారు. గతంలో పాఠశాలల్లో కంటి తనిఖీలు చేసిన వారికి దృష్టి దోషం ఉన్న విద్యార్థులకు మళ్లీ నేత్ర పరీక్షలు నిర్వహించాలని, పరీక్షలు చేసి దృష్టిదోషం ఉన్న విద్యార్థులందరికీ కళ్లజోళ్లు పంపిణీ చేయాలని ఆదేశించారు. జిల్లా కంటి వెలుగు సెల్ నేత్ర వైద్యాధికారి జీరు నగేష్ రెడ్డి నేత్ర వైద్యశిబిరంలో పరీక్షలు చేసిన వారి వివరాలు పోర్టల్‌లో ఎలా పొందుపరచాలో వివరిస్తూ మెల్లకన్ను, గాయాల వల్ల వచ్చే కేటరాక్ట్ శస్త్ర చికిత్సల కోసం పలు సూచనలు చేశారు. సమావేశంలో జిల్లాలో పనిచేస్తున్న నేత్ర వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

ఒడిశా ఇసుక ర్యాంపు పరిశీలన


ఇసుక ర్యాంప్ వద్ద జీపీఎస్‌లో పరిశీలిస్తున్న ఆర్డీఓ రమణ, ఇతర లధికారులు

భామిని: మండలంలోని దిమ్మిడిజోల సమీపంలో వంశధార నదీ తీరంలో ఒడిశా ప్రభుత్వం నిర్వహిస్తున్న ఇసుక ర్యాంపును పార్వతీపురం మన్యం జిల్లా అదికారులు సోమవారం పరిశీలించారు. పాలకొండ ఆర్డీఓ వి.వి.రమణ పర్యవేక్షణలో డివిజనల్ సర్వేయర్ పి.వెంకటరావు, జిల్లా మైన్స్ జియాలజిస్టు కుమారస్వామి, ఎస్ఈబీ సీఐ శ్రీనివాసరావుల బృందం ఇసుక ర్యాంప్‌ను సందర్శించి పరిశీలించింది. వంశధార నదీ తీరంలోని ఒడిశా భూభాగంలో ఇసుక తవ్వకాలు జరగడం లేదని, నిబంధనలకు విరుద్ధంగా ఆంధ్రా భూభాగంలో ఇసుక తరలిస్తున్నారని సొలికిరి గ్రామానికి చెందిన రైతుల ఫిర్యాదు మేరకు జిల్లా అధికారులు దర్యాప్తు చేపట్టారు. ఈ మేరకు ఇసుక ర్యాంపు చుట్టూ జీపీఎస్‌లో సర్వే చే శారు. ఒడిశా అధికారులు పెట్టిన సరిహద్దు బోర్డులు, వాటిలోని వివరాలు గుర్తించారు. జీపీఎస్‌లో నమోదు చేసిన వివరాలను సరిహద్దుల మ్యాప్‌లలో గుర్తించనున్నట్లు అధికారులు తెలిపారు. అంతవరకు ఇసుక నిల్వలు తరలించకుండా యథావిధిగా ఉంచాలని నిర్వాహకులను అధికారులు ఆదేశించారు. ఈ సర్వేలో భామిని సర్వేయర్ రాజేశ్వరరావు, ఎమ్మార్వై ఎస్.రాంబాబు, వీఆర్‌ఓలు. సొలికిరి రైతులు ఉన్నారు.

నేడు, రేపు జిల్లా స్థాయి సెమినార్

పార్వతీపురం టౌన్: పార్వతీపురం మన్యం జిల్లా వ్యాయామ ఉపాధ్యాయుల జిల్లా స్థాయి సెమినార్, వర్క్‌షాపును ఈ నెల 30, 31తేదీల్లో నిర్వహించనున్నట్లు జిల్లా విద్యాశాఖాధికారిణి జి. పగడాలమ్మ లెలిపారు. ఈ మేరకు ఆదివారం ఆమె ఒక ప్రకటన విడుదల చేశారు. జిల్లాలో గల అన్ని యాజమాన్య పాఠశాలల వ్యాయామ ఉపాధ్యాయులు తప్పకుండా ఈ సెమినార్‌కు హాజరుకావాలని కోరారు. సీతానగరం మండలంలోని జోగింపేట స్కూల్ ఆఫ్ ఎక్స్‌లెన్స్ వద్ద ఉదయం 8.30గంటల నుంచి సాయంత్రం 4.30గంటల వరకు సెమినార్ జరుగుతుందని సమయపాలన పాటించి సరైన సమయానికి హాజరు కావాలని స్పష్టం చేశారు.

ఆగంతుకుడి నుంచి రక్షణ కల్పించండి


విలేకరులతో మాట్లాడుతున్న సీపీఎం నాయకుడు శంకర్రావు

బొబ్బిలిరూరల్: అసభ్య ఫొటోలు, వీడియోలు, పదజాలంతో మానసికంగా వేధిస్తున్న ఆగంతుకుడిని పట్టుకుని, తమకు రక్షణ కల్పించాలని బాధితురాలైన ఓ మహిళ పోలీసులను కోరింది. బొబ్బిలి మండలంలోని పిరిడి గ్రామ సచివాలయంలో ఏఎన్ఎంగా పనిచేస్తున్న దివెల సత్యవతి, తదితరులు సోమవారం ఈ మేరకు సీఐ నాగేశ్వర్రావుకు ఫిర్యాదుచేశారు. గడిచిన గురువారం (25వతేదీన) మధ్యాహ్నం తన ఫోన్‌కు 9470080473 నంబర్‌తో కాల్ వచ్చిందని, డీఎంహెచ్‌ఓ కార్యాలయం నుంచి మాట్లాడుతున్నానని, సచివాలయం పరిధిలోని ఆశ, అంగన్వాడీల ఫోన్ నంబర్లు, సమాచారం కావాలని చెప్పినట్లు ఫిర్యాదులో బాధితురాలు ఏఎన్ఎం పేర్కొంది. గర్భిణుల ఆరోగ్య సమాచారం తెలుసుకునేందుకు వివరాలడినట్లు ఆగంతుకుడు చెప్పగా తాను అందరి నంబర్లు పంపించానని, నాటినుంచి ప్రతిరోజూ వాట్సాప్ నంబర్ 9542399747 నుంచి ఆశ, అంగన్వాడీలకు అసభ్యకరమైన వీడియోలను పంపుతూ అర్ధరాత్రి వేళ ఫోన్‌లు చేసి తమను మానసికంగా వేధిస్తున్నాడని ఏఎన్ఎం సత్యవతి, తదితరులు ఫిర్యాదు చేశారు. ఆగంతుకుడిని పట్టుకుని చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. దీనిపై సీఐ నాగేశ్వర్రావు మాట్లాడుతూ బాధితుల ఫిర్యాదు తీసుకున్నామని, దర్యాప్తు నిర్వహించి చట్టపరమైన చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఈ సంఘటనపై సీపీఎం జిల్లా నాయకుడు పి.శంకర్రావు స్పందించి విలేకరులతో మాట్లాడారు. అమాయక గ్రామీణ ఉద్యోగినులపై మానసిక దాడిచేస్తున్న వ్యక్తిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

చికెన్		
బ్రాయిలర్		
లైవ్	డ్రెస్‌డ్	స్కిన్‌లెస్
₹102	₹174	₹184

వర్కింగ్ జర్నలిస్టు హెల్త్‌స్కీం పొడిగింపు

పార్వతీపురం: వర్కింగ్ జర్నలిస్ట్ హెల్త్‌స్కీం పథకాన్ని 2024-25 ఆర్థిక సంవత్సరానికి జర్నలిస్టులందరికీ పొడించారు. ఈనెల 31లోగా చలానా చెల్లించి డీపీఆర్‌ఓ కార్యాలయంలో సమర్పించాల్సి ఉంటుంది. డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ. సీఎఫ్ఎంఎఫ్. ఏపీ.జీఓవీ.ఇన్ వెబ్‌సైట్‌లో రూ. 1250లు డీడీఓ కోడ్ 2703-0802-003, హెడ్‌ఆఫ్ అకౌంట్ 8342-00-120-01-03-001-001కు చెల్లించాలి. ప్రీమియం చెల్లించిన జర్నలిస్టులు ఒరిజనల్ చలానా, అక్రిడేషన్ జిరాక్స్, హెల్త్ స్కీం జిరాక్స్, కుటుంబసభ్యుల ఫొటోలు, ఆధార్‌కార్డు కాపీలను జిల్లా సమాచార పౌరసంబంధాల అధికారికి అందజేయాలని సంబంధిత అధికారులు పేర్కొన్నారు.

పాముకాటుతో వ్యక్తి మృతి

సీతానగరం: మండల కేంద్రానికి చెందిన నాగవరపు వీరభద్రుడు (64) పాముకాటుతో సోమవారం మృతిచెందాడు. వీరభద్రుడు స్నానం కోసం శ్రీ వేణుగోపాల స్వామి గుడిపక్కన సువర్ణముఖినది రేవుకి ఆదివారం సాయంత్రం 6.30గంటల సమయంలో వెళ్తుండగా నాగుపాము కాటు వేసింది. తిరిగి ఇంటికి వచ్చి తన ఎడమ కాలిమీద నాగుపాము కరిచిందని కుటుంబసభ్యులకు తెలిపాడు. వెంటనే కుటుంబసభ్యులు స్థానిక పీహెచ్‌సీకి చికిత్సకోసం తరలించారు. అనంతరం మెరుగైన చికిత్సకోసం పార్వతీపురం ఏరియా ఆస్పత్రికి తీసుకువెళ్లగా పరీక్షించిన వైద్యులు మృతిచెందినట్లు ధ్రువీకరించారు. మృతుడికి భార్య, ఇద్దరు ఆడపిల్లలు, ఒక అబ్బాయి ఉన్నారు. గతేడాది మృతుడి అల్లుడు కేన్సర్‌తో మృతిచెందగా ఏడాది కూడా గడవకముందే కుటుంబయజమాని మృతి చెందడంతో ఆ కుటుంబం రోదన వర్ణనాతీతంగా ఉంది.